క్లుప్తంగా


ఉద్యోగుల నిరసన



జామి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

జామి: న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్‌శాఖ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు భరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

జామి: అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణుడి జన్మ నక్షత్రం సందర్భంగా విశేష అర్చనలు చేపట్టినట్లు ప్రధానార్చకుడు ఫణిహారం సీతారామాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చక్రవర్తి

చీపురుపల్లి: నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2024 అక్టోబర్ 16 నుంచి 2025 ఆగస్టు 31 వరకు చీపురుపల్లి సర్కిల్ పరిధిలో 100 బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. అందులో భాగంగానే 100 మందిని అదుపులోకి తీసుకుని 985 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 2025 సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆరు బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి 49 మద్యం బాటిళ్లు సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై గిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఆర్.రామచంద్రాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రరావు తెలిపారు. ఇటీవల రామభద్రాపురం మండలం ఆరికతోట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి జూడో పోటీలలో బోనెల అఖిల్‌కుమార్, కొండేటి జ్యోత్స్న ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తినాయుడు, ఇతర ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

మోక్షగుండం సేవలు చిరస్మరణీయం



మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు

కొత్తవలస: మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమైనవని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ స్వామినాయుడు అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈ స్వామినాయుడు మాట్లాడుతూ.. మోక్షగుండం అపర భగీరథుడిగా పేరుగాంచారన్నారు. కార్యక్రమంలో పలువురు సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

అన్నదాతకు యూరియా అందేనా..?



లోగిశ రైతుసేవా కేంద్రం వద్ద బారులుదీరిన రైతులు

- గజపతినగరం, లోగిశలో తోపులాటలు
- పోలీసుల రంగ ప్రవేశం
- ఉద్రిక్తతల నడుమ పంపిణీ

గజపతినగరం: ఖరీఫ్ సీజన్‌లో అందించాల్సిన యూరియా నేటి వరకు ప్రభుత్వం అందించలేకపోయింది. చీటీలు రాయించుకున్నా.. గంటల తరబడి క్యూలో నిల్చొన్నా యూరియ దొరకని పరిస్థితి నెలకొంది. కేవలం ప్రభుత్వం అసమర్థత వల్లే రైతుకు యూరియా దొరకడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గజపతినగరం పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో జిన్నాం, లింగాలవలస, ఎం.కొత్తవలస, ముచ్చర్ల, మధుపాడ, తదితర గ్రామల ప్రజలు చేరుకున్నారు. తెల్లవారుజాము నుంచే క్యూలో బారులుదీరారు. అయితే పీఏసీఎస్ సిబ్బంది సమయానికి రాకపోవడం, ఎరువుల పంపిణీ ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. గేట్లు తోసుకుని, కుర్చీలు ఇరగ్గొట్టి మరీ ఎరువు కోసం ఎగబడ్డారు.ముందుగానే డబ్బులు చెల్లించి చీటీలు పొందినా యూరియా దొరకలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తోపులాటల మధ్య ఎరువులను పంపిణీ చేయలేక అధికారులు కూడా చేతులెత్తేశారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను సంప్రదించగా.. పీఏసీఎస్ సిబ్బంది సమయానికి రాకపోవడంతో ఎరువుల పంపిణీ ఆలస్యమైందని.. అయినప్పటికీ 30 నుంచి 40 బస్తాల వరకు పంపిణీ చేశామని చెప్పారు.



డబ్బులు చెల్లించి చీటీలు పొందినా ఎరువు అందలేదని చెబుతున్న ఎం.కొత్తవలస రైతులు



రైతుల తోపులాటలో విరిగిన కుర్చీలు

తప్పని పాట్లు..

దత్తిరాజేరు: ప్రభుత్వం సకాలంలో సరిపడా ఎరువులు తీసుకురాకపోవడంతో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మరడాం రైతుసేవా కేంద్రానికి ఏడు గ్రామాల రైతులు చేరుకుని క్యూలో నిలబడ్డారు. కోమటిపల్లి, పాచలవలస, మరడాం, కె. కొత్తవలస, తాడేందొరవలస, మర్రివలస, కృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులకు సుమారు 15 టన్నులు కావాల్సి ఉండగా.. 9 టన్నుల యూరియా తెచ్చి కొంత మందికి అందజేసి, మిగిలిన వారికి తర్వాత ఇస్తామని అధికారులు చెప్పడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు యూరియా పంపిణీకి అడ్డంకి ఏర్పడింది. గంటల కొద్దీ ఎండలో ఉంటే ఒక్క బస్తా దొరికిందని పలువురు రైతులు చెప్పడం విశేషం.



మరడాం రైతుసేవా కేంద్రం వద్ద క్యూలో ఉన్న రైతులు



కనిమెరక ఆర్ఎస్‌కే వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

పోలీసులు, తహసీల్దార్ సమక్షంలో పంపిణీ..

బొండపల్లి: మండలంలోని కనిమెరక రైతుసేవా కేంద్రానికి రైతులు పెద్దెత్తున తరలిరావడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్ఎస్‌కే పరిధిలో కనిమెరక, గిట్టుపల్లి, బోడసింగిపేట గ్రామాలున్నాయి. అయితే కేంద్రానికి సోమవారం పది టన్నుల యూరియా వస్తుందన్న సమాచారంతో మూడు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు ఉదయం ఏడు గంటలకే చేరుకున్నారు. అయితే క్యూలో నిల్చొన్న రైతులకు కాకుండా గిట్టుపల్లి గ్రామానికి చెందిన రైతులకు యూరియా ఇవ్వడంపై మిగిలిన గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. దీంతో పంపిణీ కేంద్రం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎస్సై యు.మహేష్, ఏఓ మల్లికార్జునరావు చేరుకుని క్యూలో ఉన్న వారికి ఒక బస్తా చొప్పున యూరియా ఇస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. మధ్యాహ్న సమయానికి ఆర్డీఓ దాట్ల కీర్తి ఆర్ఎస్‌కేను పరిశీలించి యూరియా పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కనిమెరకలో యూరియా పంపిణీపై ఆరా తీస్తున్న ఆర్డీఓ కీర్తి

లోగిశ గ్రామంలో ఉద్రిక్తత..

మండలంలోని లోగిశ ఆర్ఎస్‌కే వద్ద కూడా యూరియా పంపిణీలో తోపులాట చోటుచేసుకుంది. ఈ తోపులాటలో బూడి అప్పలనాయుడు అనే రైతు కింద పడిపోయాడు. అధికార పార్టీకి చెందిన వారికి మాత్రం ఎరువులు అందుతున్నాయని, సామాన్యులకు మొండిచేయి చూపుతున్నారని పలువురు ఆరోపించారు. పోలీసుల నడుమ అరకొరగా యూరియా పంపిణీ చేశారు.

వెనుదిరిగిన రైతులు..

కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెం సచివాలయం పరిధిలో గల రైతుసేవా కేంద్రం వద్ద తహసీల్దార్, వ్యవసాయ అధికారులు , పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. అయితే కొంత మంది రైతులకు యూరియా అందకపోవడంతో ఉసురోమంటూ వెనుదిరిగారు. అందని రైతులకు కూడా యూరియా అందజేస్తామని తహసీల్దార్ అప్పలరాజు, ఏఓ రామ్‌ప్రసాద్ తెలిపారు.

అన్ని రంగాల్లో రాణించాలి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు అన్ని రంగాల్లో రాణించాలని ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవులు అన్నారు. గరివిడిలో పద్మశాలి యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీ కులస్తులు ఐక్యతతో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను అలవరుచుకుని ఒకరికి ఒకరు సహకరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న గరివిడికి చెందిన దొడ్డి వెంకటరమణకు పద్మశాలి యువజన సేవా సంఘం తరపున 66 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు ఎస్.సూరిబాబు, జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షుడు వంక ఉదయ్‌కుమార్, సంఘ ప్రతినిధులు బడిగంటి సీతారామ్, బంగారాజు, కల్తూరి సీతారాములు, బట్నా జగదీష్, సీరపు శ్రీను, కాదూరి రామారావు, తీడ రమణ, తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ బాధితుడికి నగదు అందజేస్తున్న చిరంజీవులు, సంఘ ప్రతినిధులు

బంద్ విజయవంతం చేయండి

దత్తిరాజేరు: ఈనెల 17న విజయనగరంలో ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు చేసే బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి కోరారు. ఈ మేరకు కోమటిపల్లి ఆటోస్టాండ్ వద్ద బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహన మిత్ర పథకం కింద ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ చలనాలు రద్దు చేయడంతో పాటు ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో శ్రీను, చంటి, అప్పలనాయుడు, సత్యనారాయణ, గౌరినాయుడు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకురాలు లక్ష్మి

ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

గజపతినగరం: రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ మూర్తిరాజు (సురేష్‌బాబు) ఆరోపించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర వద్ద ఎరువులు పుష్కలంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాలేకపోయిందన్నారు. ఎరువుల పంపిణీలో జరుగుతున్న అవకతవకలను తెలుసుకుని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీయాలని పిలుపునిచ్చారు. పాత శ్రీరంగరాజపురం డ్వాక్రా సంఘంలో బుక్‌కీపర్‌గా పని చేస్తున్న ఒకరిని ఎటువంటి తీర్మానం లేకుండా తీసేశారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అన్యాయంగా ఎలా తొలగిస్తారని ఏపీఎం నారాయణరావును నిలదీశారు. అలాగే రైతుసేవా కేంద్రాల వద్ద ఎరువులు పంపిణీ చేయాల్సి ఉండగా..ప్రైవేట్ భవానాల్లో ఎలా పంపిణీ చేస్తారని కేఎస్ఆర్ పురం, మధుపాడ సర్పంచ్‌లు నిలదీయగా.. ఇకపై అలాంటి జరగకుండా చూస్తానని ఏఓ పి.కిరణ్‌కుమార్ బదులిచ్చారు. అనంతరం పలు సమస్యలపై సభ్యులు నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను వివరిస్తున్న సభ్యులు

దళిత రణభేరిని విజయవంతం చేయండి

లక్కవరపుకోట: దళితలపై జరుగుతున్న దాడులు, వేధింపులను నిరసిస్తూ ఈ నెల 24న విజయవాడ ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న దళిత రణభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల అంబేద్కర్ సామాజిక భవనంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దోని అప్పారావు, గాలి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



గరివిడి: ఇంజినీర్ దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాలభాస్కరరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గరివిడి అల్లాయిస్ కార్పొరేషన్ ఏజీఎం, మెకానికల్ ఇంజినీర్ ఆర్‌వీకే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ..మోక్షగుండం అసాధారణ విజయాలు సాధించిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ అనిల్‌కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా..



ఎస్.కోట: పంచాయతీరాజ్ కార్యాలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు

శృంగవరపుకోట: పట్టణంలోని ఇంజినీరింగ్ కార్యాలయంలో ఇంజినీరింగ్ డే కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఈ స్వామినాయుడు, అప్పారావు, మండల ఇంజినీరింగ్ అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై విచారణ

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామానికి చెందిన మధు అనే యువకుడుపై ఆగస్టు 28న నమోదైన పోక్సో కేసుపై విజయగనరం డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ మైనర్‌తో ప్రేమ వ్యవహారం కొనసాగించి, మోసం చేయడంపై నిందితుడిపై కేసు నమోదైంది. విచారణలోఎస్సై నవీన్‌పడాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలి

- ఉద్యానవన శాఖాధికారి అనూష

చీపురుపల్లి: లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఉద్యానవన శాఖాధికారి ఎం.అనూష కోరారు. మండలంలోని పీకే.పాలవలసలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాధికా ఆయిల్‌పామ్ కంపెనీ ద్వారా రైతులకు ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు అందజేస్తామన్నారు. అలాగే హెక్టార్‌కు గరిష్టంగా రూ. 29 వేల వరకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని చెప్పారు. అలాగే అంతర పంటల నిర్వహణకు హెక్టారుకు ప్రతి ఏడాదీ రూ. 10,500 ప్రోత్సాహక రాయితీలు నాలుగు సంవత్సరాల వరకు ఉంటాయని తెలిపారు. ఎకరా విస్తీర్ణంలో ఆయల్‌పామ్ సాగు చేస్తే అన్ని ఖర్చులు పోనూ రూ. 1.30 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయాధికారి సోనియా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి అనూష

పోలీసుల ఔదార్యం

- లక్ష రూపాయలతో రోడ్డుకు మరమ్మతులు

చీపురుపల్లి: దారి తప్పిన వాడిని దారిలోకి తెచ్చేందుకు లాఠీ పట్టడమే కాదు.. గోతుల దారిలో రాకపోకలు సాగించలేని పౌరులకు రోడ్డు వేయడం కూడా తమకు తెలుసునని పోలీసులు తెలిపారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు గాంధీబొమ్మ జంక్షన్ నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఈ రోడ్డుపై ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అధ్వాన రహదారిపై పత్రికల్లో పలు కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. దీంతో తమకు సంబంధం లేకపోయినా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎస్సై ఎల్. దామోదరరావు రూ. లక్ష రూపాయలతో రహదారికి మరమ్మతులు చేయిస్తున్నారు. సోమవారం గ్రావెల్ తెప్పించి వేశారు. ప్రభుత్వం చేయాల్సిన ఈ పని పోలీసులు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



దగ్గరుండి రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై దామోదరరావు

సిమెంట్ సరఫరాకు అంగీకారం



అయ్యప్ప సన్నిదానం పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం పరిసరాల్లోని ముత్యాలమ్మ ఆలయం పక్కనే నిర్మాణంలో ఉన్న అయ్యప్ప సన్నిదానానికి అవసరమైన సిమెంట్ సరఫరా చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి సహకరించాలని గ్రామపెద్దలతో పాటు అయ్యప్ప స్వాములు కోరడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు సోమవారం నిర్మాణంలో ఉన్న అయ్యప్ప సన్నిదానంను పరిశీలించారు. సిమెంట్‌తో పాటు బోరు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు రమణ, కొసిరెడ్డి రమణ, కర్రోతు ప్రసాద్, రౌతు పైడిరాజు, బూరాడ మహేష్, తలచుట్ల రాము, మజ్జి శంకర్, పతివాడ అఖిల్, డబ్బాడ ఆనంద్, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహం ఖననం

చీపురుపల్లి: దాదాపు నాలుగు రోజులుగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఉన్న అనాథ మృతదేహాన్ని రైల్వే పోలీసుల సూచనలు మేరకు పట్టణానికి చెందిన బత్తుల నారాయణస్వామి సోమవారం ఖననం చేశారు. దీనికి సంబంధించి జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు మాట్లాడుతూ.. ఈ నెల 11న గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి, చీపురుపల్లి ఏరియా ఆస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు. అయితే 72 గంటలు దాటినప్పటికీ సంబంధీకులు ఎవ్వరూ రాకపోవడంతో ఖననం చేయించామన్నారు.

వీడని ట్రాఫిక్ కష్టాలు



అలమండ సంత వద్ద ట్రాఫిక్ కష్టాలు

- అలమండ సంత వద్ద ప్రతి సోమవారం ఇదే తంతు
- ఎప్పటికప్పుడు స్తంభించిపోతున్న ట్రాఫిక్

జామి: మండలంలోని లొట్లపల్లి పంచాయతీ అలమండ సంత వద్ద ప్రతి సోమవారం అతి పెద్ద సంత జరుగుతుంది. దీంతో సోమవారం వచ్చిందంటే చాలు ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఈ సంతకు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచి కూడా రైతులు, వ్యాపారస్తులు వేలాది మంది వస్తుంటారు. పశువుల సంతగా ఎంతో ప్రసిద్ధిగాంచింది. అలాగే కూరగాయల క్రయ, విక్రయాలు కూడా జోరుగా సాగుతుంటాయి. దీంతో ప్రతి సోమవారం సంత జనాలతో కిక్కిరిసిపోతుంటుంది. సంతకు వచ్చే వాహనాలన్నీ విజయనగరం నుంచి కొత్తవలస, అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లే రహదారులమీదే పార్కింగ్ చేస్తుంటారు. ఒక్క వ్యాన్‌లే సుమారు రెండు కిలోమీటర్ల మేర బారులుతీరి ఉంటాయంటే పరిస్థితి ఎలా ఉంటుందోఅర్థం చేసుకోవచ్చు. పైగా ద్విచక్ర వాహనాలను కూడా ఎక్కడబడితే అక్కడ నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. సంత లోపల వాహనాలు పార్క్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నా ఫలితం ఉండడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంత నిర్వహణపై దృష్టి సారించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రధాన రహదారిని ఆనుకునే నిలిపిన వ్యాన్‌లు

పాఠశాలల్లో అవగాహన సదస్సులు

గుర్ల: పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సీడీపీఓ ఆరుద్ర అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గరివిడి మండల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శకుంతల, పద్మావతి, భారతి పాల్గొన్నారు.